క్లుప్తంగా

చిర్రావూరులో రక్తపరీక్షలు



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని చిర్రావూరులో గురువారం ఎనిమియా ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా రక్తపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి నూతక్కి ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి ఎస్.లక్ష్మీనారాయణ హాజరై రక్తపరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రక్త పరీక్షలో ఐరన్ తక్కువగా ఉన్నవారికి ఐరన్ టాబ్లెట్లు, వారు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు గురించి వివరించామని తెలిపారు. చిర్రావూరులోని హైస్కూల్ విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నూతక్కి ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారిణి ఎస్.పి.విజయలక్ష్మి హెల్త్ సూపర్‌వైజర్ కె.శివశంకరరావు, సీహెచ్‌వో గ్రేస్ రాబర్ట్, సులోచనారాణి, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని తూర్పుబజారు పోలేరమ్మ ఆలయ సమీపంలో విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి దానిని సరిచేసేలా చూడాలని కోరుతున్నారు.

విద్యుత్‌శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పలుచోట్ల విద్యుత్ నిఘా విభాగం ఆధ్వర్యంలో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొత్తం 3091 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేసి వారిలో మాల్ ప్రాక్టీస్, విద్యుత్ చౌర్యంకు పాల్పడిన వారితోపాటు అనుమతి పొందిన లోడ్ కంటే ఎక్కువ వినియోగించుకుంటున్న గృహ, వాణిజ్య, పారిశ్రామిక సర్వీసుల్లో 98 మందిని గుర్తించారు. వీరికి రూ.11,46,400 జరిమానా విధించినట్లు అమరావతి డివిజన్ ఈఈ టీవీ తులసీరామ్ తెలిపారు. తనిఖీల్లో ఈఈ కేవీఎల్ఎన్ మూర్తి, డీఈఈలు అక్కల సత్యనారాయణ, ఎం సురేంద్రబాబు, కేవీ కోటేశ్వరరావు, ఏఈలు పాల్గొన్నారు.

కేఎల్‌యూ విద్యార్థినికి ఎన్‌సీసీ అవార్డు



తాడేపల్లిరూరల్:తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో విద్యార్థిని యశ్వినికి ఎన్‌సీసీ పురస్కారం లభించినట్లు విశ్వవిద్యాలయ విద్యార్థి సంక్షేమ విభాగ అధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేఎల్‌యూలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న యశ్విని సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, డ్రిల్‌లో అత్యంత ప్రతిభ కనబరిచినందుకుగాను ఈ పురస్కారం లభించిందన్నారు. యశ్వినిని అభినందించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రొ చాన్స్‌లర్ డాక్టర్ కెఎస్ జగన్నాధరావు, వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, సాక్ అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతు రమ్య, ఎన్‌సీసీ అధికారి పావని, సమన్వయకర్త జి.చంద్రశేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ పితామహుడు మండల్

మంగళగిరి: బీసీ రిజర్వేషన్ పితామహుడు బిందెశ్వర్ ప్రసాద్ మండల్ అని బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ కొనియాడారు. నగరంలోని సంఘం కార్యాలయంలో గురువారం బిందెశ్వర్ ప్రసాద్ మండల్ వర్ధంతి కార్యక్రమం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కాగితాల స్వాతి, తిరువీధుల కిరణ్, డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు శాతం రాయితీతో ఆస్తిపన్ను చెల్లించాలి

మంగళగిరి: నగర పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఈనెలాఖరులోపు ఐదు శాతం రాయితీతో ఆస్తి పన్ను చెల్లించవచ్చునని నగర కమిషనర్ యు శారదాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డెబిట్‌కార్డు, ఫోన్‌పే, గుగూల్ పే, ఆన్‌లైన్ ద్వారా చెల్లించే వారికి ఎలాంటి అదనపు రుసుం ఉండవన్నారు. పన్నుల చెల్లింపు కోసం మంగళగిరి కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌తో రైతులకు భరోసా

- విత్తన, భూసార, మొలక శాతం పరీక్షలకు ల్యాబ్ ఏర్పాటు
- రూ.58లక్షలతో పూర్తి చేసుకున్న ల్యాబ్
- నేడు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రారంభం



నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్మించిన వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్



వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక పరీక్షా యంత్రాలు

మంగళగిరి: ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మేలైన విత్తనాలు రైతులకు అందించాలనే లక్ష్యంతో రైతు భరోసా కేంద్రాలు పనిచేస్తున్నాయి. అలాగే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు పరీక్షించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ అగ్రి టెస్ట్ ల్యాబ్స్‌ను రాష్ట్ర వ్యాప్తంగా నెలకొల్పింది. దీనిలో భాగంగానే నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో రూ.58లక్షలతో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించారు. ల్యాబ్స్‌కు వచ్చిన శాంపిల్స్ పరీక్ష కోసం ప్రత్యేకంగా ఆటోమేటెడ్ క్వాలిటీ కంట్రోల్ యాప్ అభివృద్ధి చేశారు. ల్యాబ్‌లో పరీక్షించిన ఫలితాలను తారుమారు చేసేందుకు వీలు లేకుండా ప్రతి లాబొరేటరీ ఆటోమెషిన్ ఏర్పాటు చేశారు. టెస్టింగ్ చేసిన ప్రతి ఒక్కటి రికార్డు కావడంతోపాటు ఫలితాలు వాటంతట అవే సిస్టమ్‌లో నమోదవుతాయి. రైతు షాపుకు వెళ్లినప్పుడు బ్యాచ్ నెంబర్ చూసుకుంటే నాణ్యతా సర్టిఫికెట్ ఉందో లేదో తెలుస్తుంది. రైతులు తమ సొంత విత్తనాల నాణ్యతను అగ్రి ల్యాబ్‌లో పరీక్ష చేసుకునే అవకాశం కల్పించారు. గ్రామస్థాయిలో పశువులకు వచ్చే వ్యాధులను నిర్ధారించేందుకు కూడా ఇక్కడ అవకాశం వుంది. వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతా పరీక్షలు నిర్వహించడంతో పాటు భూసార పరీక్షలు నిర్వహించనున్నారు. విత్తనాలకు నాణ్యతా పరీక్షలు నిర్వహించిన అనంతరం విత్తనం పాడుకాకుండా జెర్మనేటర్‌లో ఉంచుతారు. ఉష్ణోగ్రతలో మార్పు వచ్చినా విత్తనం పాడుకాకుండా ఓవెన్‌లో భద్రపరుస్తారు. అత్యాధునిక టెక్నాలజీ కలిగిన యంత్రాలతో భూసార పరీక్షలు నిర్వహించనున్నారు. ల్యాబ్‌లో రైతులకు అందుబాటులో ఇద్దరు ఏఈవోలు ఉండగా వ్యవసాయ శాఖ మండల అధికారి, ఏడీఏలు పర్యవేక్షిస్తుంటారు. ఈ నేపథ్యంలో నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్మాణం పూర్తిచేసుకున్న వెస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను శుక్రవారం ప్రారంభించనున్నారు. ఉదమం 11 గంటలకు రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు ప్రారంభించనుండగా పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొననున్నట్లు వ్యవసాయ శాఖ ఏడీఏ జి శ్రీనివాస్‌రెడ్డి గురువారం తెలిపారు. వచ్చే వ్యవసాయ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులతోపాటు భూసార పరీక్షలు అందుబాటులోకి రానున్నాయని, రైతులు పంటలు వేసే ముందు తమ పొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. పంట వేసే సమయంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పరీక్షలు నిర్వహించుకుని నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు వాడి నాణ్యమైన అధిక దిగుబడులు సాధించి అత్యధిక ఆదాయం పొందాలని కోరారు.

పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

- సిబ్బంది పనితీరు పరిశీలన
- పెండింగ్ కేసులపై చర్చ



తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌ను గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కౌంటర్ దగ్గర నుంచి ఇతర అంశాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పలు కేసుల ఫైళ్లను పరిశీలించి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణ ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని, అది మనందరి బాధ్యత అని అన్నారు. వేసవికాలంలో చాలామంది తమ సొంత ఊళ్లకు వెళుతుంటారని, వారికి పోలీసులు ఏర్పాటు చేసిన ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్ హౌస్ మానటరింగ్ సిస్టమ్)పై అవగాహన కల్పించి ఊరు వెళ్లిన వారి ఇంటికి అమర్చాలని అన్నారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రి పూట విధులు నిర్వర్తించే సిబ్బంది వారి వెంట తప్పనిసరిగా ఫింగర్ ప్రింట్ స్కానర్‌ను ఉంచుకుని, అనుమానితుల ఫింగర్ ప్రింట్స్ తీయాలని సూచించారు. కార్యక్రమంలో నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ రాంబాబు, ఎస్‌బీ సీఐ నరసింహారావు, తాడేపల్లి పోలీస్‌స్టేషన్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



రామచంద్రాపురం కోళ్ల ఫారాలలో నిల్వ చేసిన రేషన్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు

మంగళగిరి: నగర పరిధిలోని రామచంద్రాపురం కోళ్ల ఫారాలలో అక్రమంగా నిల్వ ఉంచిన 31.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఆయా యజమానులపై కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు గురువారం రామచంద్రాపురంలోని లక్ష్మీ పౌల్ట్రీ ఫారం, బాలాజీ పౌల్ట్రీ ఫారం, కోటేశ్వరరావు ఫారం, శశి ఫారాలలో నిల్వ వుంచిన 31.50 క్వింటాల్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని యజమానులపై 6–ఏ కేసులు నమోదు చేశారు. దాడులలో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎ కోటేశ్వరరావు, తహసీల్దార్ కె నాగమల్లేశ్వరరావు, సీఎస్‌డీటీ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో...

మంగళగిరి పట్టణంలో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యల పరిష్కారం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్



మహిళలకు సంక్షేమ పథకాలు అందిన తీరును వివరిస్తున్న కత్తెర సురేష్‌కుమార్

పొన్నెకల్లు(తాడికొండ): గ్రామాల్లో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరించేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకొని ప్రభుత్వం ద్వారా ఆ కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించారు. ప్రజా సంక్షేమానికి వెన్నుదన్నుగా ఉంటున్న ప్రభుత్వం ప్రతి పేదవాడికి కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా సంక్షేమం అందిస్తుందని, ప్రతి గడపలో మాకు లభిస్తున్న ఆదరణే ఇందుకు నిదర్శనమన్నారు. గతంలో పార్టీలు ఎన్నికల ముందు మ్యానిఫెస్టోలో అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక కనీసం ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా పత్తా లేకుండా పోయేవని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుకు భిన్నంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజల వద్దకు వస్తున్నాడని ఆశీర్వదించాలని కోరారు. అధికారంలోకి వచ్చి గెలిచిన పార్టీలు గతంలో ఎప్పుడూ సమస్యల కోసం ఇంటింటికీ తిరిగిన దాఖలాలే లేవని, ఆ విధానం ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే ప్రారంభమైందంటే అది జగనన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట సర్పంచ్ నూకతోటి మేరిమ్మ, గ్రామ పార్టీ అధ్యక్షుడు పప్పుల సీతారామిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్ల శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, తాళ్ల శివనాగరాజు, చింతల భాగ్యారావు, ఎస్ రాజ్‌కుమార్, తాడిబోయిన శివ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సంబంధ సమస్యలకు పరిష్కారం

తహసీల్దార్ ఫణీంద్రబాబు



దామరపల్లి(తాడికొండ): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకంతో రైతుల భూ సంబంధ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్రబాబు తెలిపారు. తాడికొండ మండలం దామరపల్లి గ్రామంలో రీ సర్వే ప్రక్రియను ప్రారంభించిన ఆయన గ్రామ సర్పంచ్ నల్లిబోయిన సరస్వతీతో కలిసి డ్రోన్‌ను ప్రారంభించి సర్వే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న భూముల సమస్యలు ఇకపై శాశ్వతంగా తొలగిపోనున్నాయన్నారు. డీటీవో సీహెచ్ మల్లికార్జునరావు, ఆర్ఐ కోటేశ్వరరావు, మండల సర్వేయర్ బాబురావు, వీఆర్వో జి రమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లిబోయిన శ్రీనివాసరావు, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ మహిళా కళాశాల వార్షికోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల 81వ వార్షికోత్సవాన్ని శనివారం సాయంత్రం 5.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తులసీ గ్రూప్ సంస్థల చైర్మన్ తులసీ రామచంద్రప్రభు, విజయవాడ సంయుక్త రవాణా కమిషనర్ డాక్టర్ భువనగిరి శ్రీకృష్ణవేణి, సుప్రీంకోర్టు న్యాయవాది మన్నవ ఆర్కేఎం సోదేకర్ అతిథులుగా హాజరుకానున్నట్లు ఆమె పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని మెల్లెంపూడి గ్రామానికి చెందిన ఓ బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్కే రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఎమ్మెల్యే ఆర్కే ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని బాధిత కుటంబానికి గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. వారు మాట్లాడుతూ మెల్లంపూడి గ్రామానికి చెందిన కంచర్ల అర్లప్ప ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడని, ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం బెడ్ రెస్ట్ తీసుకుంటున్నాడని, కుటుంబ పోషణకు ఇబ్బందిపడుతున్నాడని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సహృదయంతో రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కత్తిక రాఘవరావు (బుల్లబ్బాయి), మున్నంగి వివేకానందరెడ్డి, ఉయ్యూరు శివరామిరెడ్డి, బొమ్మరెడ్డి రాజారామిరెడ్డి, ఈదూలమూడి శేఖర్, రామకృష్ణారెడ్డి (నాని), మొగల్ జలీల్, షేక్ అలంబుడె, నాగుల్ మీరా, ఈదులమూడి ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత

తాడేపల్లి పట్టణ పరిధిలోని సిమెంట్ ఫ్యాక్టరీ బొగ్గిళ్లలో నివాసముండే సాతులూరి కోటేశ్వరరావు 20 రోజుల కిందట ప్రకాష్‌నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకున్నాడు. కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నాడని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా రెండు నెలలకు సరిగా నిత్యావసర సరుకులు, బియ్యం అందజేశారు. బాధిత కుటుంబ ఎమ్మెల్యే ఆర్కేకు ధన్యవాదాలు తెలియజేసింది.

మంగళగిరి: నగరంలోని రత్నాలచెరువు కాలనీకి చెందిన నిరుపేదలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. రత్నాల చెరువు కాలనీకి చెందిన గుంటి భాస్కర్, పార్వతిలు పేదరికంతో ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేయగా గురువారం పార్టీ నాయకులు వారికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, మల్లవరపు సుధారాణి, ఎండీ ఫిరోజ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

గుంటూరు ఈస్ట్: విద్యార్థిని అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదుచేశారు. హిందూ కళాశాల డిగ్రీ విద్యార్థిని రెండు రోజుల కిందట కళాశాలకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లకుండా ఏటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రారంభం



కుంచనపల్లిలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఇదే

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని కుంచనపల్లిలో రూ.1.30 కోట్లతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్యశాలలో 10 పడకలతోపాటు అత్యాధునిక టెక్నాలజీతో ల్యాబ్, ఇతర మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు ప్రారంభోత్సవం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి, జిల్లా వైద్య అధికారులు విచ్చేయున్నారని వైద్యాధికారులు తెలియజేశారు. ఈ కేంద్రం వల్ల కుంచనపల్లి, ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరు, మెల్లెంపూడి, వడ్డేశ్వరం, కొలనుకొండతో పాటు తాడేపల్లి పట్టణ పరిధిలోని కొన్ని ప్రాంత్రాల్లో నివసించేవారికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

16న ఈమనిలో మెగా వైద్యశిబిరం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో ఈనెల 16న మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు మానవ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వంగర సురేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమని గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే శిబిరంలో డయాబెటిక్ వైద్యులు వేణుగోపాల్‌రెడ్డి, గుండె జబ్బుల వైద్యులు కామన వంశీకృష్ణ, జనరల్ వైద్యులు వేణుగోపాల్‌రెడ్డి, ప్రసాద్, కీళ్ల, ఎముకల వైద్యులు వంశీ, దంత వైద్యులు చక్రవర్తి, సుస్మిత, ఆయుర్వేద వైద్యులు రవిబాబు, హోమియో వైద్యులు రామకృష్ణ, ఫిజియోథెరపీ వైద్యులు బాషా, లక్ష్మి తమ సేవలను అందించనున్నారని తెలిపారు. పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. దుగ్గిరాల మండల ప్రజలు ఈ అవశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రాంగణ ఎంపికలలో చలపతి విద్యార్థుల ప్రతిభ



మోతడక(తాడికొండ): హ్యూండాయ్ మొబిస్ కంపెనీ వారు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో తమ కళాశాలకు చెందిన 132 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ వి రంగారావు తెలిపారు. అప్టిట్యూడ్, టెక్నికల్, ముఖాముఖి ఇంటర్వ్యూల ద్వారా ఆఖరి సంవత్సరం విద్యార్థులు 39, మూడవ సంవత్సరం విద్యార్థులు 93 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్‌తో పాటు చైర్మన్ వైవీ ఆంజనేయులు, కార్యదర్శి వై సుజిత్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ కె నాగ శ్రీనివాసరావు పలువురు అధ్యాపకులు అభినందించారు.

వాడవాడలా జగనన్నే మా భవిష్యత్



మార్కండేయ కాలనీలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

మంగళగిరి: నగరంలోని వాడవాడలా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జోరుగా కొనసాగుతుంది. నగరంలోని మార్కండేయ కాలనీలో గురువారం జరిగిన మా నమ్మకం నీవే జగన్...జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి పాల్గొని ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే జగనన్నే ముఖ్యమంత్రి కావాలని, ఆయనకు అండగా ఉంటామని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఇంటింటికీ సర్వే నిర్వహించి మా నమ్మకం నీవే జగన్ స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు దేవళ్ల సుబ్బారావు, దేవళ్ల పద్మ ఇర్ల రమణమ్మ, కొండమ్మ, గుంటి వెంకటేశ్వరమ్మ, పల్లపు సునీల్, గల్లా రవి, ఇర్ల రవిచంద్ర, వేముల ఏసు, చల్లా శేఖర్, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు. కొప్పురావు కాలనీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలీయ కార్పొరేషన్ డైరెక్టర్ పారేపల్లి విజయలక్ష్మి పాల్గొని ఇంటింటా తిరిగి సంక్షేమ పథకాలు వివరించి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహ సారథు పాల్గొన్నారు. కొత్తపేటలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరించి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పవన్‌కుమార్, నజీర్, మనోహర్, అష్రఫ్, సరోజని, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు. 20వ వార్డు సచివాలయం పరిధిలో వార్డు వలంటీర్లు, గృహసారథులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఏడవ వార్డులో మాజీ కౌన్సిలర్ బెజ్జం రాజాజీ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరించి సర్వే నిర్వహించారు. 11, 12 వార్డులతోపాటు ఆయా వార్డులు, కాజ, చినకాకాని, నిడమర్రు, ఆత్మకూరు, యర్రబాలెం, నవులూరు, పెదవడ్లపూడి ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించి సంక్షేమ పథకాలను వివరించి సర్వే నిర్వహించారు.

తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి, కుంచనపల్లి ప్రాంతాల్లో గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏ ఇంటికి వెళ్లినా వారిని సాదరంగా ఆహ్వానిస్తూ, మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అంటూ ప్రజలు నీరాజనం పలుకుతున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న తాడేపల్లి రూరల్ యువజన అధ్యక్షుడు, జేసీఎస్ మండల కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆధ్వర్యంలో మంగళగిరి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. ఉండవల్లిలో జరిగిన కార్యక్రమంలో తోక సత్యనారాయణ, బత్తుల ప్రభుదాసు, కళ్లం పిచ్చిరెడ్డి, గంగాధర్ ఏడుకొండలు యాదవ్, రాజు, అట్లాస్ శ్రీను తదితరులు పాల్గొన్నారు. కుంచనపల్లిలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కన్వీనర్ మిరియాల రాంబాబు, మాజీ వైస్ సర్పంచ్ అమరా నాగయ్య, తాతబ్బాయి, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు. ప్రాతూరులో జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేరి రాణి, ఎంపీటీసీ మాజీ సభ్యులు బత్తుల సత్యనారాయణరెడ్డి, తాడేపల్లి రూరల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు సంకురు మరియబాబు, పార్టీ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.